సాక్షి
నాగర్‌కర్నూల్
శుక్రవారం ꠱ 5 ꠱ సెప్టెంబర్ ꠱ 2025

గరిష్టం/కనిష్టం
33.3 /20.9

వాతావరణం
అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.



వెళ్లిరావయ్యా.. విఘ్నేశ్వరా..

జిల్లా కేంద్రంలో తొమ్మిది రోజుల పాటు విశేష పూజలు అందుకున్న బొజ్జ గణపయ్య గురువారం గంగమ్మ ఒడికి చేరాడు. ఈ సందర్భంగా నిర్వహించిన శోభాయాత్ర కనులపండువగా సాగింది. డీజే మోతలు, డప్పు చప్పుళ్ల నుడుమ జరిగిన శోభాయాత్రలో చిన్నారులు, యువత ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ, నృత్యాలతో హోరెత్తించారు. మహిళలు కోలాటాలు, బతుకమ్మ ఆడారు. పట్టణ పురవీధుల్లో ఊరేగింపు అనంతరం కేసరి సముద్రం చెరువులో నిమజ్జనం చేశారు. అంతకు ముందు మండపాల వద్ద గణనాథులకు ప్రత్యేక పూజలు అనంతరం లడ్డు వేలం నిర్వహించారు.

– కందనూలు

మరిన్ని 9 లో..

న్యూస్‌రీల్

నేడు రేషన్ దుకాణాలు బంద్

నాగరకర్నూల్: తమ న్యాయమైన **డిమాండ్లను** నెరవేర్చాలని కోరుతూ శుక్రవా**రం జిల్లాలోని** రేషన్ దుకాణాలను మూసివే**స్తున్నామని సం**ఘం జిల్లా అధ్యక్షుడు సాధిక్‌పా**షా గురువారం** ఒక ప్రకటనలో తెలిపారు. ఈ **సందర్భంగా** ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన కనీస గౌరవ వేతనం రూ.5 వేలు, కమీషన్ పెంచాలని, డీలర్లు పంపిణీ చేసిన 5 నెలల కేంద్ర ప్రభుత్వ బియ్యం కమీషన్ డబ్బులు చెల్లించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేర్వేరు కాకుండా ఒకే కమీషన్ ఎప్పటికప్పుడు చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ ఆవేదనను ప్రభుత్వానికి శాంతియుతంగా తెలిపేందుకు శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా రేషన్ దుకాణాల బంద్ చేస్తున్నామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కందనూలు: హైదరాబాద్‌లోని జింఖానా మైదానంలో ఈ నెల 9 నుంచి 10 వరకు నిర్వహించే రాష్ట్రస్థాయి సివిల్ సర్వీసెస్ క్రీడల్లో పాల్గొనేందుకు ఆసక్తి గల జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు శనివారం వరకు దరఖాస్తు చేసుకోవాలని డీవైఎస్ఓ సీతారాం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్, వాలీబాల్, బ్యాట్మింటన్, క్రికెట్, చెస్, క్యారమ్స్, ఫుట్‌బాల్, హాకీ, కబడ్డీ, లాన్ టెన్నిస్, పవర్ లిఫ్టింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్, బెస్ట్ ఫిసిక్, యోగా, ఖోఖో తదితర వాటిలో పాల్గొనే అభ్యర్థులు ఉద్యోగ గుర్తింపుతోపాటు ఆధార్ కార్డుతో కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలని సూచించారు.

వైభవంగా వట్టెం వెంకన్న పవిత్రోత్సవాలు



బిజినేపల్లి: మండలంలోని వట్టెం వెంకన్న ఆలయంలో శ్రీమదర్మేల్ మంగ గోదాదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలు గురువారం వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు చతుస్థానార్చన, పూర్ణాహుతి, పవిత్ర మాలధారణ చేపట్టారు. ఈ ఉత్సవాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కనుల పండువగా కొనసాగాయి.

కార్మికుల హక్కుల సాధనకు పోరాటాలు




నాగర్‌కర్నూల్ రూరల్: రాష్ట్రవ్యాప్తంగా కార్మికుల హక్కుల సాధన కోసం సమరశీల పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి అన్నారు. గురువారం సీఐటీయూ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన ప్యాక్టర్ కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం హక్కులను కాలరాస్తూ 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్‌కోడ్లు తీసుకురావడం కార్మికుల హక్కులను హరించడమే అన్నారు. నాలుగు లేబర్ కోడ్స్ వల్ల కార్మికులకు 8 గంటల పని విధానం పోయి 12 గంటలకు పెరుగుతుందన్నారు. జిల్లాలో కార్మిక యాజమాన్యాలు వెట్టి చాకిరి చేయిస్తున్నారని, కార్మిక చట్టాలు ఎక్కడా అమలు కావడం లేదని విమర్శించారు. వెంటనే స్కీం వర్కర్లను పర్మనెంట్ చేయాలని, పరిశ్రమలో పనిచేసే కార్మికులకు కనీస వేతనాల జీఓలను గెజిట్ చేసి రూ.26 వేల వేతనం ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు పర్వతాలు, రామయ్య, శంకర్‌నాయక్, శివవర్మ, దశరథం, శివరాములు, వెంకటయ్య, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి అంగీకారం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: రీజియన్‌లో ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి ఆర్ఎం సంతోష్‌కుమార్ అంగీకరించారని ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ ఫోరం అధ్యక్షుడు రాజసింహుడు, నాయకులు జె.ఎస్.రెడ్డి, భగవంతు తెలిపారు. ఈ విషయమై గురువారం ఆయనకు వినతి పత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌లో కోత విధించిన 30 శాతం ఆదాయపు పన్ను తిరిగి చెల్లించేందుకు ఒప్పుకొన్నారన్నారు. ఎలక్ట్రికల్ డీలక్స్ బస్సుల్లో రిటైర్డ్ ఉద్యోగుల భార్యాభర్తల ప్రయాణ ం, ఆర్టీసీ క్లినిక్‌లో ల్యాబ్ టెక్నీషియన్ నియామకానికి, మందుల సరఫరాకు అంగీకరించారన్నారు. సంఘం నాయకులు రామాంజనేయులు, అంజన్న, మనోహర్, రియాజొద్దీన్, బుచ్చన్న పాల్గొన్నారు.

గురుభ్యోనమః



- బోధనతోపాటు ఆటపాటల్లోనూ ప్రోత్సాహం అందిస్తున్న పలువురు ఉపాధ్యాయులు
- నూతన ఆవిష్కరణలు, సైన్స్ వైపు మరల్చేందుకు కృషి
- బడుల్లో పిల్లల సంఖ్యను పెంచేందుకు ప్రత్యేక దృష్టి

నేడు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం

ప్రతి ఒక్కరి నడవడిక, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే దార్శనికులు గురువు. అజ్ఞానపు చీకట్లను తొలగిస్తూ.. వెలుగుల జ్ఞానాన్ని ప్రసరింపజేసే ప్రత్యక్ష దైవం గురువు. ఈ క్రమంలో కొందరు ఉపాధ్యాయులు కేవలం విద్యాబోధనకే పరిమితం కాకుండా.. విద్యార్థులకు నైతిక విలువలతోపాటు క్రీడలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. బడికి దూరంగా ఉన్న పిల్లలను బడిలో చేర్పిస్తూ.. బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచుతూ ప్రభుత్వ పాఠశాలలను కాపాడుతున్నారు. శుక్రవారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

– సాక్షి, నాగర్‌కర్నూల్



వలస కూలీలను బడిలో చేర్పించి..



భృంగ కృష్ణప్రసాద్

కొల్లాపూర్ మండలంలోని సింగోటం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న భృంగ కృష్ణప్రసాద్ విద్యాబోధనతోపాటు నైపుణ్యాలను నేర్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. గతంలో సోమశిల పాఠశాలలో పనిచేయగా ప్రారంభంలో 80 మంది విద్యార్థులు ఉండగా, వారి సంఖ్యను 142కు పెంచారు. కృష్ణాతీరంలో వలస జీవులుగా ఉన్న మత్స్యకారుల పిల్లలను బడిలో చేర్పించారు. నదికి అవతలి వైపు ఉన్న విద్యార్థులను నిత్యం పాఠశాలకు చేరేలా బోటు ఏర్పాటు చేయించారు. ప్రస్తుతం సింగోటం పాఠశాలలో తరగతి గదులను పేయింటింగ్‌తో అందంగా తీర్చిదిద్దారు. ఈ పాఠశాలలో 72 మంది విద్యార్థుల నుంచి వారి సంఖ్యను 119కి పెంచడంలో ఎంతో కృషిచేశారు.

బడిని మార్చి.. ఆదర్శంగా నిలిపి..

ప్రభుత్వ పాఠశాలను అందంగా తీర్చిదిద్దుతూ విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తూ కల్వకుర్తి మండలం బెక్కర పాఠశాల ఉపాధ్యాయుడు రఘురామారావు ఆదర్శంగా నిలుస్తున్నారు. బెక్కర ప్రభుత్వ పాఠశాలలో గోడలకు రంగులు వేసి, అందమైన బొమ్మలతో ఆహ్లాదకరంగా మార్చారు. ప్రహరీ గోడలను సైతం పెయింటింగ్, కళాకృతులతో అందంగా తీర్చిదిద్దారు. పాఠశాల ప్రాంగణంలో 170 మొక్కలను నాటి ప్రశాంత వాతావరణం కల్పించారు. విద్యార్థులకు మూస పద్ధతిలో కాకుండా ప్రొజెక్టర్, కంప్యూటర్, టీవీ ద్వారా డిజిటల్, సాంకేతిక విద్యను అందిస్తున్నారు. ఐదుగురు విద్యార్థులతో మూసివేతకు సిద్ధంగా ఉన్న పాఠశాలను 40 మందికి పెంచారు. టీచర్ లెర్నింగ్ మెటీరియల్ విధానంలో గణితం, సైన్స్, ఇంగ్లిష్ వంటి సబ్జెక్టులను సులభంగా అర్థమయ్యేలా బోధిస్తున్నారు. గతేడాది రాష్ట్రస్థాయిలో ఉత్తమ టీచర్‌గా అవార్డు పొందారు. ఈ ఏడాది జూలై నెలలో రాష్ట్ర స్థాయిలో బెస్ట్ ప్రాక్టీసింగ్ స్కూల్‌గా బెక్కర ప్రాథమిక పాఠశాల ఎంపికైంది.



బెక్కర ప్రాథమిక పాఠశాల గోడలపై బొమ్మలు గీస్తున్న ఉపాధ్యాయుడు రఘురామారావు

ఆవిష్కరణల వైపు అడుగులు..



రాజశేఖరరావు

చిన్నముద్దునూర్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు రాజశేఖరరావు సైన్స్ టీచర్‌గా పాఠాలు చెబుతూనే.. విద్యార్థులకు నిజ జీవితంలోనూ సమస్యలకు పరిష్కారం చూపేలా ఆవిష్కరణల వైపు అడుగులు వేయిస్తున్నారు. ఇక్కడి విద్యార్థులు ఔషధ మొక్కల ఆకుల చూర్ణంతో కూరగాయలను ఎక్కువ కాలం నిల్వ చేసే విధానాన్ని ఆవిష్కరించారు. ఇండియన్ ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌లో జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో నిలిచారు. మానవుని మెదడు ఆకృతిని వర్ణించేందుకు హెల్మెట్ రూపంలో మోడల్ తయారు చేసి విద్యార్థులకు బోధిస్తున్నారు. వినూత్న పద్ధతిలో పాఠాలు చెబుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

నర్సింహారావుకు ఉత్తమ అవార్డు

జడ్చర్ల టౌన్: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ అధ్యాపకులలో పట్టణంలోని డిగ్రీ కళాశాల హిందీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డా.నర్సింహారావు కల్యాణి ఎంపికయ్యారు. నారాయణపేటకు చెందిన డా.నర్సింహారావు ఇంటర్ వరకు అక్కడే చదవి డిగ్రీ జడ్చర్ల బీఆర్ఆర్ కళాశాలలో చేశారు. ఆ తర్వాత హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో హిందీ విభాగంలో ఎంఏ, ఎంఫిల్ పట్టాలు పొంది హిందీ సాహితీవేత్త డా.ప్రభాకర్ నవలల్లో సమకాలిన వాస్తవికత అంశంపై పరిశోధన చేసి పీహెచ్‌డీ పొందాడు. 2008లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఇప్పటి వరకు 30హిందీ కథలను రాయగా.. హిందీ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. పీయూ, ఎంవీఎస్ డిగ్రీ కళాశాల, ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాల, హిందీ బోర్డు ఆఫ్ స్టడీస్ సభ్యుడిగా సేవలు అందిస్తున్నారు. అలాగే హిందీ, ఉర్దూ బోర్డు ఆఫ్‌స్టడీస్ చైర్మన్‌గా పనిచేస్తున్నారు. జిజ్ఞాసలో రాష్ట్రస్థాయి ద్వితీయ బహుమతి, హిందీ వీడియో పాఠాలు బోధిస్తూ పలువురి ప్రశంసలు పొందుతున్నారు. రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికై నందుకు ప్రిన్సిపాల్ సుకన్య నేతృత్వంలోని అధ్యాపకబృందం గురువారం శాలువాతో సత్కరించి అభినందించారు.



నర్సింహారావు కల్యాణిని సన్మానించి అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఆనందంగా ఉంది

చదువుకున్న కళాశాలలో పనిచేస్తున్న సమయంలోనే రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకుడి అవార్డు రావడం ఆనందంగా ఉంది. జూనియర్ లెక్చరర్‌గా దివంగత వైఎస్సార్ చేతుల మీదుగా రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్నా. తిరిగి ఇన్నాళ్లకు డిగ్రీ కళాశాల స్థాయిలో అవార్డు రావడంతో నాపై మరింత బాధ్యత పెరిగింది. హిందీ విభాగంలో మరింత సేవలు అందించేందుకు అవార్డు స్ఫూర్తిగా నిలవనుంది.

– నర్సింహారావు కల్యాణి, అసోసియేట్ ప్రొఫెసర్, డిగ్రీ కళాశాల, జడ్చర్ల

విద్యారంగంలో సేవకు..



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మహబూబ్‌నగర్‌లోని ఎంబీసీ (ఎయిడెడ్) పాఠశాల హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న జగదీశ్వర్‌రెడ్డి కొన్నేళ్లుగా విద్యారంగంలో చేస్తున్న సేవలను గుర్తించి ప్రభుత్వం రాష్ట్రస్థాయి అవార్డును ప్రకటించింది. ఈ మేరకు పాఠశాలలో ఎస్సెస్సీ విద్యార్థులు ఉత్తీర్ణత శాతం పెంచడం, వనరులు అరకొర ఉన్నప్పటికీ విద్యార్థులు పాఠశాల యాజమాన్యం సహాయ, సహకారాలతో మెరుగైన విద్య అందించడంలో తనదైన పాత్ర పోషించారు. విద్యార్థులకు కావాల్సిన వసతులు, వనరులు సమకూర్చడంలో పూర్వ విద్యార్థులు, తోటి ఉపాధ్యాయుల సహకారంతో ఆర్వోప్లాంట్, బోర్, డ్యూయెల్ డెస్కుల్, బోర్డులు సమకూర్చారు.

సమాజ సేవ చేస్తాం

ప్రభుత్వం ఉత్తమ అవార్డు ఇవ్వడంతో బాధ్యత పెరిగింది. దీని ద్వారా మరింత సమాజ సేవ, విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు కృషిచేస్తా. పేద విద్యార్థులకు అన్నిసౌకర్యాలతో కూడిన విద్య అందించే దిశగా అడుగులు వేస్తాం. ఇందుకు సహకరించిన డీఈఓ ప్రవీణ్‌కుమార్, పాఠశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు.

– జగదీశ్వర్‌రెడ్డి, ఎంబీసీ పాఠశాల హెచ్‌ఎం

ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేయాలి

- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

కందనూలు: ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేయాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని గురువారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమానికి మంత్రి జూపల్లితోపాటు కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, రాజేశ్‌రెడ్డి, వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భావి భారత పౌరుల భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలన్నారు. అనంతరం కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ జిల్లాలో విద్యా వ్యవస్థ బలోపేతానికి కృషిచేస్తున్నామని, అందుకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, మధ్యాహ్న భోజన పథకం సమర్థవంతంగా అమలు, ఏకరూప దుస్తుల పంపిణీ, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాల సరఫరా వంటివి పకడ్బందీగా చేపడుతున్నామన్నారు. గతంలో 10వ తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో 23వ స్థానంలో ఉన్న జిల్లా, ఉపాధ్యాయుల కృషితో 13వ స్థానానికి చేరుకుందన్నారు.

- ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల అంకితభావంతోనే సమాజం ముందుకు సాగుతుందని, ప్రతి విద్యార్థి భవిష్యత్ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అపారమని అన్నారు. చిన్నతనంలో అందించిన ఆ విలువలు, క్రమశిక్షణ, జ్ఞానం వల్లే తాను ప్రజలకు సేవ చేయడానికి ఈ స్థాయికి ఎదిగినట్లు పేర్కొన్నారు.
- అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ దేశాభివృద్ధి తరగతి గది నుంచే ప్రారంభమవుతుందని నమ్మిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో విద్యాశాఖ పారదర్శకంగా పనిచేస్తోందని చెప్పారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను ఎన్నడూ లేని విధంగా పారదర్శకంగా నిర్వహించడం ద్వారా ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించారని చెప్పారు.
- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రతి పిల్లవాడికి స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కల్పిస్తూ మెరుగైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు కృత నిశ్చయంతో బోధించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, ఉపాధ్యాయులు ప్రోత్సహిస్తే, వారు ఉన్నత స్థానాలను చేరుకుంటారన్నారు. అనంతరం 52 మంది జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను జ్ఞాపికలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో డీఈఓ రమేష్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, సెక్టోరియల్ అధికారులు నూరుద్దీన్, శోభారాణి, కిరణ్‌కుమార్, ఎంఈఓలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి జూపల్లి ఆగ్రహం..

జిల్లాలో 3,600 మంది ఉపాధ్యాయులు ఉండగా.. సన్మాన కార్యక్రమానికి వెయ్యి మంది ఉపాధ్యాయులు కూడా హాజరుకాకపోవడంతో మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు హాజరయ్యాక మరోసారి ఈ కార్యక్రమాన్ని నిర్వహిద్దాం అని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులపై నాకు అపారమైన గౌరవం ఉంది కానీ, పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు లేరు కదా అని అసహనం వ్యక్తం చేశారు.



ఉత్తమ ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, పక్కన కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, వంశీకృష్ణ, డీఈఓ రమేష్‌కుమార్ తదితరులు

ఉత్తమ ఉపాధ్యాయులు వీరే..

జిల్లావ్యాప్తంగా వివిధ పాఠశాలలకు చెందిన 52 మందిని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వారిలో బి.రఘు (బల్మూరు), ఎ.శ్రీనివాసులు (పెద్దపల్లి), ఎస్.జగపతిరెడ్డి (చందుబట్ల), పి.రాములు (కోండ్రావుపల్లి), ఎ.మాధవరెడ్డి (గాజర), ఎండీ షఫి (చేగుంట), ఎస్.వెంకటేశ్వర్‌రెడ్డి (తుమ్మన్‌పేట), పరమేశ్వరయ్య (నందివడ్డెమాన్), ఎం.శైలజ (ముష్టిపల్లి), ఎస్.పద్మ (గుండూరు), ఎ.వాణి (పెంట్లవెల్లి), ఎ.సువర్ణ (మంగనూర్), బి.అనురాధ(బల్మూర్), ఎస్.చంద్రశేఖర్ (పెద్దకొత్తపల్లి), విమలాదేవి(తూడుకుర్తి), వి.గీత (చారకొండ), కె.రామన్‌గౌడ్ (చందుబట్ల), డి.నిరంజన్ (అమ్రాబాద్), ఎన్.సత్యశ్రీ (పెద్దకొత్తపల్లి), మైబమ్మ (రంగాపూర్), జమాల్ అహ్మద్ (ఎల్లికల్), నందకిషోర్‌యాదవ్(ఎల్లికల్), ఎన్.వెంకటయ్య (నాగర్‌కర్నూల్), డి.ప్రభాకర్(బిజినేపల్లి), పి.కృష్ణవేణి (నార్లాపూర్), సన్వాజ్‌బేగం (కార్వంగ), ఈ.శ్రీనివాసులు (తర్నికల్), ఎ.వీరేష్ (ఐతోలు), వి.సూర్యకళ (బిజినేపల్లి), డి.నాగమణి (పెద్దూరు), కె.రాంబాబు (బుద్దసముద్రం), సాయిప్రకాష్‌రెడ్డి (పెద్దకార్పాముల), కె.రవీందర్‌నాయక్ (నర్సాయిపల్లి), బి.సత్యనారాయణ (చారకొండ), టి.గోపాల్ (గోకారం), జి.విజయ్‌కుమార్ (తర్నికల్), ఆర్.సాధన (అచ్చంపేట), పి.రామగోపాల్‌గౌడ్ (రామాజిపల్లి), కె.ప్రశాంత్‌కుమార్ (శేరిఅప్పారెడ్డిపల్లి), అరుణ (మారేపల్లి), ఎం.పుష్పవతి (పోతిరెడ్డిపల్లి), జి.మురళీధర్‌రావు (నాగర్‌కర్నూల్), కె.కోటేశ్వర్‌రావు (తుమ్మలపల్లి) బి.జైపాల్(వట్టిపల్లి), బి.ఉమాదేవి (చిన్నముద్దునూర్), ఎస్.స్రవంతి (వెల్దండ), కె.రాజబాయి(అచ్చంపేట), ఎన్.మాధవి (లింగాల), కె.ఉమాదేవి (వెల్దండ), ఎస్.నిరోష (బిజినేపల్లి), వి.నాగరాజు (వెల్దండ) ఉన్నారు.

సీజనల్ వ్యాధులతో బెంబేలు

వర్షాల కారణంగా జిల్లాలో పెరుగుతున్న విష జ్వరాలు

- రోగులతో కిటకిటలాడుతున్న ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు
- స్థాయికి మించి వైద్యం చేస్తున్న ఆర్ఎంపీలు

నాగర్‌కర్నూల్ క్రైం: రెండు నెలలుగా కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లాలో సీజనల్ వ్యాధులతో పాటు విషజ్వరాలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. జిల్లాలోని అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్ ప్రాంతాల్లో వర్షాలతో తాగునీరు కలుషితమవుతుంది. వాటిని తాగిన ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. దీంతో పాటు పరిసరాలు అపరిశుభ్రంగా మారుతుండటంతో దోమల వ్యాప్తి పెరిగి టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి సీజనల్ వ్యాధులు పెరిగిపోతున్నాయి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో ప్రజలకు సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. అయినా వ్యాధులు రోజురోజుకూ పెరిగిపోయి ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. ఇటీవల మున్సిపాలిటీ పరిధిలోని దేశిటిక్యాల గ్రామంలో ఆరేళ్ల చిన్నారి టైఫాయిడ్ బారిన పడి మృతి చెందిన ఘటన వెలుగులోకి వచ్చింది.



రోగులతో కిటకిటలాడుతున్న జనరల్ ఆస్పత్రి



జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

ఆర్ఎంపీల చేతివాటం

జిల్లాలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చాలామంది జ్వరాల బారిన పడుతుండటంతో గ్రామాల్లో ప్రజలు ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా భావిస్తున్న వారు వచ్చిరాని వైద్యంతో అవసరం లేని టెస్టులతో పాటు యాంటిబయాటిక్స్ మందులను రోగులకు ఇస్తు స్థాయికి మించి వైద్యం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆర్ఎంపీలకు జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రులు, డయాగ్నస్టిక్, స్కానింగ్ సెంటర్లలో కమీషన్లు ముట్టజెబుతుండటంతో చాలా మంది రోగులను రెఫర్ చేస్తున్నారు. గతంలో జిల్లాలో ఆర్ఎంపీల వైద్యం వికటించి పలువురు రోగులు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయి. ఆర్ఎంపీలను కట్టడి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులను పలువురు కోరుతున్నారు.

కఠిన చర్యలు తప్పవు



సీజనల్ వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఎవరైనా సీజనల్ వ్యాధుల బారిన పడితే వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలి. ఆర్ఎంపీలను ఆశ్రయించొద్దు. ఆర్ఎంపీలు స్థాయికి మించి వైద్యం చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. జ్వరం తీవ్రత ఎక్కువగా ఉంటే వెంటనే పీహెచ్‌సీలను, జిల్లా ఆస్పత్రులను ఆశ్రయించాలి.

– డా.రవికుమార్, ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ, నాగర్‌కర్నూల్

ప్రభుత్వ లెక్కల్లో కొన్ని.. ప్రైవేటులో చాలా..

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ లెక్కల ప్రకారం మార్చిలో 1, జూలైలో 9, ఆగస్టులో 26 డెంగీ కేసులు నమోదయ్యాయి. టైఫాయిడ్, చికెన్‌గున్యా, మలేరియా కేసులు నమోదుకానట్లు వెల్లడిస్తున్నారు. కాగా జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లలో నమోదవుతున్న డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, చికెన్‌గున్యా కేసులు వందల సంఖ్యల్లో ఉన్నప్పటికీ జిల్లా వైద్యాఆరోగ్యశాఖ అధికారులకు సమాచారం అందించకపోవడం గమనార్హం. కొన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లో ధనార్జనే ధ్యేయంగా అవసరం లేకపోయినప్పటికీ విషజ్వరాల పేరిట యాంటిబయాటిక్స్‌తో వైద్యం అందిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లతో పాటు స్కానింగ్ సెంటర్లపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

క్లుప్తంగా

గల్లంతైన దంపతుల మృతదేహాలు లభ్యం




తాటికుంట రిజర్వాయర్‌లో లభ్యమైన రామడు, సంధ్య మృతదేహాలు

మల్దకల్: రిజర్వాయర్‌లో పుట్టీ సాయంతో చేపలు పట్టేందుకు వెళ్లిన దంపతులు గల్లంతు కాగా.. గురువారం వారి మృతదేహాలు లభ్యమయ్యాయి. పూర్తి వివరాలిలా.. మల్దకల్ మండలంలోని తాటికుంట రిజర్వాయర్‌లో మంగళవారం సాయంత్రం దంపతులు బోయ దుబ్బోనిబాయి రాముడు, సంధ్య చేపలవేటకు ఎంతకూ తిరిగి ఇంటికి రాకపోవడంతో వారి ఆచూకీ కోసం రెండు రోజుల పాటు ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు, గజ ఈతగాళ్లు రిజర్వాయర్‌లో గాలింపు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు గురువారం తెల్లవారుజామున దంపతుల మృతదేహాలు నీటిలో తేలుతూ కనిపించడంతో గ్రామస్తులు, కుటుంబ సభ్యులు అధికారులకు సమాచారం అందించారు. అనంతరం మల్దకల్ పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నందీకర్ తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

నవాబుపేట: పంట పొలానికి వేసిన విద్యుత్ కంచె తగిలి మహిళ మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని జంగమయ్యపల్లికి చెందిన కంచె కిష్టమ్మ(40) గ్రామ సమీపంలో కుమ్మరి రాములు వ్యవసాయ పొలంలో మొక్కజొన్న పంటకు వేసిన విద్యుత్ కంచె వల్ల షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు కుటుంబ సభ్యులు సమాచారం అందించగా కిష్టమ్మ కుమారుడు నరేష్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు.

తండ్రిపై కుమారుడి దాడి: కారు డిక్కీలో తరలింపు

కల్వకుర్తిటౌన్: వ్యవసాయ పొలం వద్ద ఉన్న కన్నతండ్రిపై కర్రతో దాడిచేసి అక్కడి నుంచి కారులో డిక్కీలో తరలించిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లో వెళ్తే.. పట్టణంలోని వాసవీనగర్‌లో నివాసముంటున్న రైతు బాలయ్య(70) పొలం వద్ద ఉండగా.. బుధవారం సాయంత్రం కుమారుడు బీరయ్య తండ్రిపై కర్రతో దాడిచేసి కారు డిక్కీలో వేసుకొని పరారయ్యాడు. రాత్రివరకు బాలయ్య ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికినా.. ఎక్కడా ఆచూకీ దొరకలేదు. దీంతో గురువారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా.. రక్తపు మరకలు ఉన్నట్లు గుర్తించారు. సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించగా.. కుమారుడు బీరయ్యనే దాడి చేసి కారులో తీసుకెళ్లినట్లు గుర్తించి అతనికోసం గాలిస్తున్నారు. 24గంటలు గడిచినా వృద్ధుడి ఆచూకీ లభించకపోవడం, దాడికి పాల్పడిన కుమారుడు పరారీలో ఉండడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై కల్వకుర్తి సీఐ నాగార్జునను వివరణ కోరగా.. గాయపడ్డ వృద్ధుడిని ఆస్పత్రిలో చేర్పించాడా? లేదా ఏమైనా చేశాడనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జగదీశ్వర్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం



మాజీ ఎమ్మెల్సీ జగదీశ్వర్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, కుటుంబసభ్యులు

- రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- ఆయనది ఎంత ఎదిగినా ఒదిగి ఉండే నైజం: మంత్రి వాకిటి శ్రీహరి
- పాలమూరులో మాజీ ఎమ్మెల్సీ జగదీశ్వర్‌రెడ్డి విగ్రహావిష్కరణ

స్టేషన్ మహబూబ్‌నగర్: మాజీ ఎమ్మెల్సీ జగదీశ్వర్‌రెడ్డి ఉమ్మడి జిల్లా డీసీసీ అధ్యక్షుడిగా పదేళ్లపాటు సుదీర్ఘకాలంగా పని చేశారని, పార్టీ యంత్రాంగాన్ని నడపాలంటే ఆయన్ను చూసి నేర్చుకోవాలని, పార్టీకి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మహబూబ్‌నగర్ పద్మావతీకాలనీలోని గ్రీన్‌బెల్టులో గురువారం మాజీ ఎమ్మెల్సీ ఎస్.జగదీశ్వర్‌రెడ్డి విగ్రహావిష్కరణలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎంపీ, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ పార్టీ పరమైన అంశాల్లో, ఇతర సమస్యల్లో ఎవరి మనసు నొప్పించక ప్రజాస్వామికబద్ధంగా వ్యవహరించేవారని అన్నారు. ఆనాడు పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో జిల్లా నుంచి ప్రధాన పాత్ర పోషించారని అన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ జగదీశ్వర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో అంచలంచెలుగా ఎదిగారని అన్నారు. రాజకీయాలకు సరైన వ్యక్తిగా ఆయన జీవన ప్రయాణం కొనసాగిందన్నారు. జీవితంలో ఎంత ఎదిగినా ఒదిగి ఉండడం ఆయననే చూసి నేర్చుకోవడం జరిగిందన్నారు. ఎంపీ డాక్టర్ మల్లురవి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి మాట్లాడుతూ జగదీశ్వర్‌రెడ్డి ఆదర్శప్రాయుడని, కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవలు అందించారని అన్నారు. సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ జగదీశ్వర్‌రెడ్డితో తనకు ఎంతో ఆత్మీయత అనుబంధం ఉందన్నారు. మొదట్లో నాకు రాజకీయాలు వద్దని చెప్పారని, తర్వాత నాకున్న ఆసక్తితో రాజకీయాల్లో ఎంతో ప్రోత్సహించారని గుర్తుచేశారు. మాజీ ఎంపీ వి.హనుమంతురావు మాట్లాడుతూ జగదీశ్వర్‌రెడ్డి నిరుపేదలకు సహాయం చేయడంలో ముందుండేవారని అన్నారు. ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ వంశీకృష్ణ, యశస్వినిరెడ్డి, కార్పొరేషన్‌ల చైర్మన్లు గురునాథ్‌రెడ్డి, ఒబేదుల్లా కొత్వాల్, కోదండారెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు భానుప్రకాశ్, యాదవరెడ్డి తదితరులు జగదీశ్వర్‌రెడ్డి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత, బెక్కరి మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ నందిని, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, సంజీవ్ ముదిరాజ్, వినోద్‌కుమార్, ఎన్‌పీ. వెంకటేశ్, చంద్రకుమార్‌గౌడ్, భగవంతురావు, సీజే బెనహర్, ప్రశాంత్‌రెడ్డి, మిథున్‌రెడ్డి, జహీర్ అఖ్తర్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బ్యాడ్మింటన్ పోటీలు



క్వాలిఫైయింగ్ రౌండ్ మ్యాచ్‌ల్లో తలపడుతున్న క్రీడాకారులు

క్వాలిఫైయింగ్ రౌండ్ మ్యాచ్‌లు పూర్తి
- నేటి నుంచి మెయిన్ డ్రా పోటీలు
- ప్రేక్షకులతో కిటకిటలాడిన ఇండోర్ స్టేడియం

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో 11వ రాష్ట్రస్థాయి జూనియర్ (అండర్–13) బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌కు సంబంధించి 225 క్వాలిఫైయింగ్ రౌండ్ మ్యాచ్‌లు గురువారం ఉత్సాహంగా జరిగాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. క్వాలిఫైయింగ్ మ్యాచ్‌ల్లో ప్రతిభ కనబరిచిన వారు శుక్రవారం నుంచి జరిగే మెయిన్ డ్రాకు అర్హత సాధించారు.

శుక్రవారం ఉదయం ప్రారంభోత్సవం...

రాష్ట్రస్థాయి అండర్–13 బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కానున్నాయని మహబూబ్‌నగర్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్యాంసుందర్‌గౌడ్, రవికుమార్ తెలిపారు. ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న క్వాలిఫైయింగ్ మ్యాచ్‌లను వారు పరిశీలించారు. నాలుగు సింథటిక్ కోర్టుల్లో సింగిల్, డబుల్స్ పోటీలు జరుగుతాయని, ఈ నెల 7న చాంపియన్‌షిప్ ముగింపు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించామన్నారు. కార్యక్రమంలో టోర్నీ పరిశీలకుడు సుధాకర్, రెఫరీ కిషోర్, జిల్లా సంయుక్త కార్యదర్శులు నాగరాజుగౌడ్, విజయ్‌రెడ్డి, ఎంపీ.ప్రవీణ్, సభ్యులు శశాంక్ పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా పంపిణీ చేయాలి



హకా రైతుసేవా కేంద్రం వద్ద పంపిణీ గురించి చైర్మన్ కోదండరెడ్డికి వివరిస్తున్న అధికారులు

రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా యూరియా పంపిణీ చేయాలని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం మహబూబ్‌నగర్ అర్బన్ మండల పరిధిలోని బోయపల్లిరోడ్‌లో గల హకా రైతు సేవా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా యూరియా పంపిణీ ప్రక్రియను మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసులును అడిగి తెలుసుకున్నారు. యూరియా కొరత లేకుండా చూసుకోవాలని, రైతులు గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఒకరోజు ముందుగానే టోకన్లు ఇచ్చి యూరియా పంపిణీ చేస్తున్నామని అధికారులు కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. అందరికీ టోకెన్లు వచ్చేలా చూడాలని, మహిళలకు, వృద్ధులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. యూరియా పక్కదారి పట్టకుండా పంపిణీ చేయాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్, జిల్లా వ్యవసాయశాఖ అధికారికి చైర్మన్ ఫోన్ చేసి యూరియా పంపిణీ, భూ భారతి చట్టం అమలు తీరుపై ఆరా తీశారు. రైతులకు ఒకే కేంద్రానికి కేంద్రానికి రాకుండా ఎక్కడి వారికి అక్కడే పంపిణీ జరిగేలా చూడాలని కలెక్టర్, డీఏఓలకు సూచించారు. రాష్ట్రంలో యూరియా కొరత లేకుండా ప్రభుత్వం, అధికార యంత్రాంగం చర్యలు చేపడుతున్న విషయాల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో అధికారులు, సేవా కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దిగువ జూరాలలో సోలార్ కేంద్రం

జెన్‌కో సీఎండీ డా. హరీశ్



దిగువ జూరాల జల విద్యుత్ కేంద్రంలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న జెన్‌కో సీఎండీ డా. హరీశ్

ఆత్మకూర్: రాష్ట్రంలోని విద్యుదుత్పత్తి కేంద్రాల వద్ద అవకాశం ఉన్నచోట సోలార్ కేంద్రాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని టీఎస్ జెన్‌కో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డా. హరీశ్ తెలిపారు. గురువారం జూరాల ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రాలను సందర్శించారు. దిగువ జూరాల వద్ద 100 ఎకరాల స్థలం అందుబాటులో ఉందని.. 20 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టుకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. అలాగే కొత్తగూడెంలో కూడా సోలార్ ప్రాజెక్టు ఏర్పాటుకు అవకాశాలు ఉన్నాయని, త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఈ ఏడాది దిగువ జూరాలలో రికార్డుస్థాయిలో విద్యుదుత్పత్తి చేపట్టి లక్ష్యాన్ని అధిగమించడం అభినందనీయమన్నారు. ఎగువన కూడా లక్ష్యానికి చేరువలో ఉన్నారని చెప్పారు. బదిలీలు చేపట్టాలని, ఖాళీలను భర్తీ చేయాలని ఉద్యోగులు సీఎండీని అభ్యర్థించగా త్వరలో చేపడతామని హామీ ఇచ్చారు. ఆయన వెంట డైరెక్టర్ బాలరాజు, ఎస్‌ఈలు శ్రీధర్, సురేష్, సిబ్బంది ఉన్నారు.

డైవర్షన్ పనులు పక్కాగా చేపట్టాలి

కేంద్ర అటవీశాఖ డీజీ చంద్రశేఖర్



చిన్నదర్పల్లి బీట్ పరిధిలో అటవీభూమి, చెట్లను పరిశీలిస్తున్న డీజీ చంద్రశేఖర్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: చిన్నదర్పల్లి ఫారెస్ట్ బీట్ పరిధిలోని జాతీయ రహదారి విస్తరణలో ఫారెస్ట్ డైవర్షన్ పనులు పక్కాగా చేపట్టాలని కేంద్ర అటవీశాఖ డీజీ చంద్రశేఖర్ జిల్లా అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రానికి సమీపంలోని చిన్నదర్పల్లి ఫారెస్ట్ బీట్ పరిధిలో జాతీయ రహదారి విస్తరణలో కోల్పోతున్న అటవీ భూమి, చెట్లను ఆయన పరిశీలించారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల నష్టానికి సంబంధించి ప్రత్యామ్నాయ చర్యల్లో భాగంగా డైవర్షన్ పనులు పక్కాగా చేపట్టాలని డీఎఫ్‌ఓ సత్యనారాయణకు సూచించారు. విస్తరణలో పోతున్న అటవీ భూమికి బదులుగా మరోచోట ఇవ్వడం, చెట్లకు బదులుగా మరోచోట నాటడం వంటి పనుల్లో ఎలాంటి జాప్యం జరగరాదని సూచించారు. అనంతరం మహబూబ్‌నగర్ సమీపంలోని దొడ్డలోనిపల్లి ఫారెస్ట్ బీట్ పరిధి ప్లాంటేషన్, మయూరీ పార్కును సందర్శించారు. పార్కులో ఏర్పాట్లు, మొక్కలు, అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో రేంజ్ అధికారి అబ్దుల్‌హాయ్, జాతీయ రహదారి ఈఈ తదితరులు పాల్గొన్నారు.



మయూరీ పార్కును పరిశీలిస్తున్న అటవీ డీజీ

మైసమ్మ ఆలయానికి అటవీ భూమి

ఆలయ కమిటీ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి



సమస్య పరిష్కారంపై వివరాలు ప్రకటిస్తున్న ఆలయ చైర్మన్, సభ్యులు


నవాబుపేట: జిల్లాలో ప్రసిద్ధిచెందిన పర్వాతాపూర్ మైసమ్మ ఆలయానికి అటవీ భూమి కోసం జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ద్వారా ప్రత్యేక ప్రతిపాదన చేసినట్లు మైసమ్మ ఆలయ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. మైసమ్మ ఆలయానికి అదనంగా 4.0889 హెక్టార్ల (దాదాపు పది ఎకరాలు)అటవీ భూమి కోసం ప్రత్యేక వినతిని జడ్చర్ల ఎమ్మెల్యే ప్రతిపాదించినట్లు తెలిపారు. దీనికి సంబంధించి కలెక్టర్ అటవీ భూమిలో సంబంధిత అధికారులతో సర్వే చేయించి అనుమతులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. కాగా, కేంద్ర కార్యాలయం తుది అనుమతి రావాల్సి ఉందని.. దీనికి త్వరలోనే అనుమతులు తీసుకొచ్చేలా చేస్తానని జడ్చర్ల ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలియజేశారు.

ఆలయ సిబ్బందికి పెరిగిన వేతనాలు

కొన్నేళ్లుగా ఆలయంలో వివిధ రకాల పనులు చేస్తున్న వారికి కనీస వేతనాలు పనికి తగ్గట్లుగా అందేవి కావు. దీంతో వారు చాలా ఏళ్లుగా కనీస వేతనం కోసం జడ్చర్ల ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించడంతో తాజాగా 6 కూలీలకు కనీస వేతనం అందించే జీఓ బుధవారం వచ్చిందని మైసమ్మ ఆలయ చైర్మన్ తెలిపారు. దీంతో గతంలో నెలకు రూ.7500 అందించే వేతనాన్ని రూ.12వేలకు పెంచినట్లు పేర్కొన్నారు. అలాగే వంశపారంపర్యంగా ఆలయంలో పనులు చేసే మరో వ్యక్తికి సంబంధించి పర్మినెంట్ వేతనం మంజూరు చేస్తూ ప్రభుత్వం గజిట్ ఇచ్చిందని తెలిపారు. దీంతో ఆలయంలో ఉన్న పెండింగ్ సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారం అవుతున్నాయని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు చైర్మన్‌తోపాటు సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

జూరాలకు కొనసాగుతున్న వరద

8 క్రస్ట్‌గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల



జూరాల నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు

ధరూరు/ఆత్మకూర్/రాజోళి/దోమలపెంట: ప్రియదర్శిని జూరాల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద నిలకడగా కొనసాగుతోందని పీజేపీ అధికారులు తెలిపారు. బుధవారం 1,02,950 క్యూసెక్కులు ఉండగా.. గురువారం రాత్రి 8.30 ప్రాంతంలో 92 వేల క్యూసెక్కుల తగ్గినట్లు చెప్పారు. దీంతో ప్రాజెక్టు 8 క్రస్ట్‌గేట్లను ఎత్తి 55,928 క్యూసెక్కులు, విద్యుదుద్పత్తికి 40,324, ఆవిరి రూపంలో 70, ఎడమ కాల్వకు 920, కుడి కాల్వకు 670, భీమా లిఫ్ట్‌కు 750 క్యూసెక్కులు వినియోగిస్తున్నట్లు వివరించారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 8.651 టీఎంసీలు ఉన్నట్లు తెలిపారు.

586.515 మి.యూ. విద్యుదుత్పత్తి..

జూరాల దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో గురువారం ఉత్పత్తి వేగవంతంగా కొనసాగిందని ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువలో 6 యూనిట్ల నుంచి 234 మెగావాట్లు, 279.387 మి.యూ., దిగువ 6 యూనిట్ల నుంచి 240 మెగావాట్లు, 307.128 మి.యూ. విద్యుదుత్పత్తి చేపట్టామని, ఇప్పటి వరకు 586.515 మి.యూ. విజయవంతంగా పూర్తి చేసినట్లు వివరించారు.

సుంకేసులకు కొనసాగుతున్న వరద..

సుంకేసుల జలాశయానికి గురువారం ఎగువ నుంచి 73 వేల క్యూసెక్కుల వరద రాగా.. 17 గేట్లను మీటర్ మేర తెరిచి 70,312 క్యూసెక్కులు దిగువకు వదిలినట్లు జేఈ మహేంద్ర వివరించారు. అలాగే 2,626 క్యూసెక్కులు కేసీ కెనాల్‌కు సరఫరా చేసినట్లు తెలిపారు.

శ్రీశైలం మూడు గేట్లు ఎత్తి..

ఎగువ నుంచి వస్తున్న నీటి ప్రవాహం పెరగడంతో గురువారం శ్రీశైలం ఆనకట్ట మూడు గేట్లు ఒక్కొక్కటి పది అడుగుల మేర ఎత్తి దిగువకు నీటిని వదిలారు. జూరాల స్పిల్‌వే నుంచి 55,928 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 40,324 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 67,872 క్యూసెక్కుల వరద జలాశయం చేరుతుందని.. జలాశయం స్పిల్‌వే ద్వారా 82,710 క్యూసెక్కులు, భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 31,012 క్యూసెక్కులు దిగువనున్న నాగార్జునసాగర్‌కు వదిలినట్లు అధికారులు వివరించారు. ప్రస్తుతం జలాశయంలో 883.9 అడుగుల నీటి మట్టం.. 209.1579 టీఎంసీల నీటి నిల్వ ఉందని చెప్పారు. భూగర్భ కేంద్రంలో 17.179 మి.యూ., కుడిగట్టు కేంద్రంలో 15.608 మి.యూ., విద్యుదుత్పత్తి చేశారు.

మహిళ మెడలో మంగళసూత్రం చోరీ



మహిళ వెనకాల వస్తున్న వ్యక్తి



బైక్‌పై పరారవుతున్న దొంగలు

బైక్‌పై పరారైన దొంగలు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని కావేరమ్మపేట ఫ్రీజన్ రోడ్డులో గురువారం గోదా నాగలక్ష్మి అనే మహిళ మెడలో గుర్తు తెలియని దుండగులు పుస్తెలతాడు (బంగారుగొలుసు) చోరీ చేశారు. స్థానికంగా నివాసముంటున్న నాగలక్ష్మి రేషన్ దుకాణానికి వెళ్లి ఇంటికి తిరిగి వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తి ఆమెను ఫాలో అవుతూ వచ్చాడు. నిర్మానుష ప్రాంతంలో మెడలోని గొలుసు చోరీ చేసినట్లు బాధితురాలు తెలిపారు. అనంతరం ఎన్ఎస్125 బైక్‌పై సిద్ధంగా ఉన్న మరో దుండగుడితో కలసి పరారైనట్లు పేర్కొన్నారు. బాధితురాలు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ మల్లేష్ సంఘటనా స్థలానికి చేరుకొని సమీపంలోని సీసీ కెమెరాల రికార్డులు పరిశీలించారు. చోరీ అయిన గొలుసు మూడు తులాలు ఉంటుందని బాధితురాలు వాపోయింది.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- 12 తులాల బంగారు, 2 కేజీల వెండి ఆభరణాలు అపహరణ

నాగర్‌కర్నూల్ క్రైం: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన మున్సిపాలిటీ పరిధిలోని నాగనూలులో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన జాలం బాలమ్మ భర్త నర్సింహతో కలిసి బుధవారం జిల్లా కేంద్రంలోని పెద్దమ్మ ఇంటికి వెళ్లి రాత్రికి అక్కడే ఉన్నారు. గురువారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా తలుపులు విరగ్గొట్టి ఉండటంతో పాటు బీరువాలోని వస్తువులు చిందర వందరగా పడి ఉండటాన్ని గమనించారు. గుర్తు తెలియని వ్యక్తులు బీరువాలోని 12 తులాల బంగారు, 2 కేజీల వెండి ఆభరణాలు, రూ.11 వేల నగదు చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతు

నవాబుపేట: చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతైన ఘటన మండలకేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. దేపల్లి గ్రామానికి చెందిన మహ్మద్ జావిద్ (35), బుచ్చయ్య ఇద్దరు బుధవారం చేపల వేటకు వెళ్లారు. కాగా జావిద్ చేపల పట్టుకునే క్రమంలో చెరువు లోపలికి వెళ్లి ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. బుచ్చయ్య గమనించి గ్రామస్తులకు సమాచారం అందించాడు. గ్రామస్తులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్‌ఐ విక్రమ్ గజ ఈతగాళ్లను రంగంలోకి దింపి మరో సారి గాలింపుచర్యలు చేపట్టారు. రాత్రి వరకు గాలించినా ఆచూకీ లభించకపోవడంతో గాలింపు చర్యలు నిలిపివేశారు. కాగా జావిద్‌కు భార్య అన్వర్‌తో పాటు నలుగురు కుమార్తెలు ఉన్నారు.

కంటైనర్‌ను ఢీకొట్టిన కారు



నుజ్జునుజ్జయిన కారు ముందు భాగం



రోహిత్ మృతదేహం

ఒకరి దుర్మరణం, ఇద్దరికి గాయాలు

జడ్చర్ల: పట్టణంలోని 44వ నంబర్ జాతీయ రహదారి ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ముందు వెళ్తున్న కంటెయినర్‌ను వెనుక నుంచి కారు ఢీకొట్టిన ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ఇద్దరు గాయాల పాలైన ఘటన గురువారం చోటు చేసుకుంది. సీఐ కమలాకర్ కథనం మేరకు హైదరాబాద్ వైపు నుంచి కర్నూల్ వైపునకు వెళ్తున్న కంటెయినర్‌ను బ్రిడ్జిపై వెనుక నుంచి అతి వేగంగా కారు ఢీకొట్టింది. ప్రమాదంలో డ్రైవర్ పక్క సీటులో కూర్చున్న రోహిత్ (30) అక్కడికక్కడే మృత్యువాత పడగా.. డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వారందరూ హైదరాబాద్‌లోని కొంపల్లికి చెందిన వారిగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మధ్యాహ్న భోజనంలో బల్లి కలకలం

- ఆహారం పారబోత.. మళ్లీ వండి విద్యార్థులకు అందజేత
- ఉప్పేరు ఉన్నత పాఠశాలలో ఘటన.. ఎంఈఓ విచారణ



వంట ఏజెన్సీ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంఈఓ రవీంద్రబాబు

ధరూరు: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో బల్లి పడిన ఘటన మండలంలో కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. ధరూరు మండలంలోని ఉప్పేరు ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్నం విద్యార్థులకు వంట ఏజెన్సీ వారు రోజులాగే భోజనం సిద్ధంచేసి ప్లేట్లలో వడ్డించారు. అనంతరం విద్యార్థులు చెట్ల కింద కూర్చొని భోజనం చేస్తుండగా ఓ విద్యార్థి ప్లేట్‌లో బల్లి కనిపించింది. దీంతో వెంటనే విషయాన్ని ఇతర విద్యార్థులకు తెలియజేయడంతో ప్లేట్లలో ఉన్న భోజనాన్ని పారబోశారు. అయితే, చెట్ల కింద కూర్చుని తింటుండగా పైనుంచి బల్లి పడి ఉండవచ్చునని ఉపాధ్యాయులు, వంట ఏజెన్సీ వారు చెబుతుండగా.. విద్యార్థులు కూరలోనే వచ్చిందంటూ సోషల్ మీడియాలో పోస్టులు, వీడియోలు వైరల్ అయ్యాయి. విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో ఎంఈఓ రవీంద్రబాబు గురువారం పాఠశాలకు చేరుకుని సంఘటనపై ఆరా తీశారు. పిల్లలు చెట్ల కింద కూర్చుని తింటుండగానే చెట్టు పైనుంచి బల్లి పడి ఇలా జరిగిందని ఉపాధ్యాయులు, వంట ఏజెన్సీ మహిళలు వివరించారు. ఎవరికీ ఎలాంటి ఆరోగ్య సమస్య తలెత్తలేదని తెలిపినట్లు ఎంఈఓ తెలిపారు. ఇదిలా ఉండగా.. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీంపాష, యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి రంగస్వామి తదితరులు పాఠశాలకు చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. వంట ఏజెన్సీ నిర్లక్ష్యం కారణంగానే ఇలా జరిగిందని, సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని రామాంజనేయులు, మనోజ్ కుమార్, గోపాల్, విజయ్ తదితరులు ఎంఈఓకు వినతిపత్రాన్ని అందజేశారు.